# ఆలకిస్తాం.. ప్రభువా!




**క్రీస్తు జననం అద్భుతం. ప్రభువు జీవనం ఆదర్శం. బోధనలు ఆచరణీయం. విశ్వాసులకు ఆయన మాట ఊరట. అజ్ఞానులకు ఆయన చేత కనువిప్పు. ఆ మహనీయుడి జీవితంలోని ప్రతి ఘట్టమూ పావనమే, అది మనకు పాఠమే! క్రిస్మస్ పండుగ సందర్భంగా ఏసు ప్రభువు సువార్తలు ఆలకించి.. మనసుకు స్వస్థతను చేకూర్చుకుందాం.**

### మాట జాగ్రత్త

ఒకసారి క్రీస్తు తన శిష్యులతో కలిసి ఓ గ్రామాన్ని సందర్శించాడు. సమయం మించిపోవడంతో శిష్యులు స్నానం చేయకుండానే భోజనానికి కూర్చున్నారు. ఆ రోజుల్లో యూదుల మతాచారం ప్రకారం.. భోజనానికి ముందు స్నానం చేయాలి. కనీసం శరీరంపై నీళ్లయినా చల్లుకోవాలి. వాటికి విరుద్ధంగా భోజనానికి ఉపక్రమించిన శిష్యులను చూసిన ఆనాటి మత పెద్దలకు అది రుచించలేదు. విమర్శలు చేయడం మొదలు పెట్టారు. అప్పుడు క్రీస్తు వారితో.. 'వెలుపలి నుంచి లోపలికి పోయి మనుషులను అపవిత్రులను చేసేది ఏదీ లేదు. కానీ, లోపల నుంచి బయటకు వెళ్లినవే మనుషులను అపవిత్రులను చేస్తాయి' అన్నారు. ఇక్కడ ప్రభువు ఉద్దేశంలో లోపల నుంచి బయటకు వెళ్లేది.. నోటిలోంచి వెలువడే మాట! ఇది హృదయం నుంచి వస్తుంది. లోపల ఉన్న దురాలోచనలు, వైషమ్యాలు, క్రోధం, అహం వంటివి మాటలుగా బయటపడి అవి మనుషులను అపవిత్రం చేస్తాయి. ఫలితం పరస్పర వైషమ్యంతో మిత్రులు, శత్రువులుగా మారే ప్రమాదం ఉందని ప్రభువు ప్రవచనంలోని పరమ సత్యం.



### వాళ్లే అర్హులు

క్రీస్తును దర్శించడానికి వందలాదిగా భక్తులు వచ్చేవారు. కొందరు తమ వెంట పిల్లలనూ తీసుకువచ్చేవారు. కారణం.. ప్రభువు పిల్లలను చూసి తమను దగ్గరికి ఆహ్వానిస్తాడని, దీవిస్తాడని, కొన్ని మంచి మాటలు చెబుతాడని! అయితే ప్రభువు శిష్యులు.. పిల్లలను వెంట తెచ్చే తల్లిదండ్రులపై ఆగ్రహం ప్రకటించేవారు. 'క్రీస్తు బోధనలు పిల్లలకు అర్థం కావు' అంటూ కోపగించేవారు. దీంతో ఆ తల్లిదండ్రులు బాధతో వెనుదిరిగేవారు. శిష్యుల ప్రవర్తన ఒకసారి ప్రభువు కంటపడింది. వారిని కోపగించుకున్నారు. 'పిల్లలను నా దగ్గరకు రాకుండా ఆటంకపరచవద్దు. వారిని ఆశీర్వదిస్తాను. పెద్దలను పరామర్శించినట్లే.. చిన్న పిల్లల విషయంలో జాగ్రత్త వహిస్తాను. ఆ చిన్నారులను ఆహ్వానించండి. ప్రేమ, నమ్మకం నిండుగా ఉన్నవాళ్లే.. దేవుని రాజ్యంలోకి ప్రవేశిస్తారు. పిల్లల మాదిరిగా వినయశీలురై ఉన్నవారికే అది సాధ్యమవుతుంది. నేర్చుకోవడానికి పిల్లల్లా కుతూహలం చూపాల'న్నారు ప్రభువు.


### ఆత్మీయతే సంపద

'ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు. పరలోక రాజ్యం వారిదే! ఇతరుల సేవకు ముందు నడిచే వారే ప్రథములు' అని క్రీస్తు ప్రబోధించిన ఈ లక్షణాలున్న వ్యక్తికి ఏ సమస్యా రాదు. హృదయంలో గర్వం కలిగిన వారు ధనికులైనా, ఉన్నత పదవుల్లో ఉన్నా.. వాళ్లు ఆధ్యాత్మికంగా పేదవారే! ఇహలోక సంపదలతో ఉన్నతస్థానంలో ఉన్నా.. ఆత్మీయ సంపదలో లేమిలో ఉంటే వారిని అధములుగా పరిగణించాలని క్రీస్తు బోధ. మనుషులు వారి సంపదలు, కీర్తిని బట్టి కాక.. సహజ గుణ విశేషాలను బట్టి గౌరవం పొందేవారే ధన్యులు అని చెబుతారు ఏసుక్రీస్తు.

... రెవ.డాక్టర్ కత్తి విక్టర్‌పాల్,
కలకోట, తెలుగు బాప్టిస్టు చర్చి
సెల్ : 9951243487


జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 25 డిసెంబర్ 2023 www.ntnews.com
13



## అత్యాశ




**వృద్ధుడైన** ఓ వస్త్ర వ్యాపారి తన వ్యాపార బాధ్యతలను కొడుక్కు అప్పగించాలనుకున్నాడు. వ్యాపారంలో కొన్ని మెలకువలు చెప్పాడు. తనను ఆశీర్వదించాల్సిందిగా కోరుతూ తండ్రి పాదాలకు నమస్కరించాడు కొడుకు. 'వ్యాపారంలోనే కాదు, ఏ విషయంలోనూ అత్యాశకు పోవద్దు' అని దీవించాడు తండ్రి. 'ఆశ లేకపోతే ఎలా సంపాదించగలం?' అన్నాడు కొడుకు. దానికి వ్యాపారి నవ్వుతూ 'సముద్రానికైనా హద్దులుంటాయేమో కానీ, ఆశకు ఉండవు. దీనికి సంబంధించిన ఒక కథ చెబుతాను విను..' అంటూ ఇలా చెప్పాడు. 'ఒక చక్రవర్తికి కడుపులో కణితి వచ్చింది. పక్క రాజ్యంలో చక్కటి శస్త్ర చికిత్స నిపుణుడు ఉన్నాడని తెలిసింది. అయితే ఆ వైద్యుడు ఆశబోతు అని చెవిన పడింది. అతణ్ని పిలిపించే ఆలోచన విరమించుకున్నాడు చక్రవర్తి. అయితే రోజులు గడిచేకొద్దీ కణితి నొప్పి తీవ్రమైంది. ఇక లాభం లేదని ఆ వైద్యుడిని పిలిపించాడు. 'నేను మిమ్మల్ని పరిపూర్ణ ఆరోగ్యవంతుణ్ని చేస్తాను. అయితే, నేను అడిగింది ఇవ్వాలి' అని కోరాడు. 'నాకు నయం చేస్తే.. ఈ రాజ్యమంతా నీకు రాసిస్తాను' అన్నాడు చక్రవర్తి. చెప్పినట్లే కణితి తొలగించి, చక్రవర్తిని సంపూర్ణ ఆరోగ్యవంతుణ్ని చేశాడు వైద్యుడు. ఇచ్చిన మాట ప్రకారం రాజ్యమంతా వైద్యుడికి కట్టబెట్టబోయాడు చక్రవర్తి. అయినా తృప్తి చెందని వైద్యుడు 'మరి దాని మాటేమిటి?' అంటూ ఆకాశం వంక చూశాడు. ఆకాశాన్ని కూడా తనకే ధారాదత్తం చేయమంటున్న వైద్యుడి అత్యాశకు చక్రవర్తితోపాటు అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. అత్యాశపరుడికి ఎంత సంపాదించినా సంతోషం ఉండదు. అలాంటివాళ్లు సుఖపడిన దాఖలాలు లేవు' అని కథ ముగించాడు. మితిమీరిన ఆశాపాశంలో చిక్కుకోకుండా ధర్మంగా వ్యాపారం చేసుకో అని కొడుకును దీవించాడు. ఆశలేని వాడే అందరికన్నా అదృష్టవంతుడని తెలుసుకున్నాడు కొడుకు. ధర్మబద్ధంగా వ్యాపారం కొనసాగించాడు.

... ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
93936 62821

## నైవేద్యం ఆరగిస్తాడా?




**మనం** నైవేద్యంగా సమర్పించిన పదార్థాలు భగవంతుడు ఆరగిస్తాడా? అన్న ప్రశ్నకు సమాధానం బ్రహ్మపురాణంలో లభిస్తుంది.

నైవేద్యం పురతోన్యస్తం చక్షుషా గృహ్యతే మయా।
రసంచ దాస జిహ్వా యా మశ్నామి కమలోద్భవా॥

'బ్రహ్మదేవా! నా ఎదుట ఉంచిన నివేదన పదార్థాలు, నా నేత్రాలతో గ్రహించి, వాటి రుచి రసాలను భక్తుడి నాలుక ద్వారా తెలుసుకుంటాను' అన్నాడు శ్రీమహావిష్ణువు. దేవతలు పరోక్ష ప్రియులు. భక్తుడి ద్వారా భగవంతుడు మనం పెట్టిన ప్రతి నివేదన పదార్థాన్నీ స్వీకరిస్తాడని నమ్మకం కలిగితే.. ఏ సందేహానికీ తావుండదు.

... శ్రీ



**ఓ సారి.. బాలుడిగా ముచ్చటగొలుపుతాడు. అంతలోనే దయ్యం పట్టినవాడిగా ముచ్చెమటలు పట్టిస్తాడు. సలక్షణ రూపంతో భక్తుణ్ని సమీపించేది ఆయనే! తనను సమీపించ వచ్చిన భక్తుణ్ని తరిమేదీ ఆయనే! పైపైన అన్వేషిస్తే ఆ తత్వం అంతుబట్టదు. అసలు సత్యం బోధపడదు. అదే దత్తాత్రేయం! అవధూత సంప్రదాయానికి ఆలవాలం. మనోనిగ్రహం ఉన్నవారికి నీడనిచ్చే ఔదుంబరం. కఠోర పరీక్షకు నిలిచినవాళ్లకు జ్ఞానాన్ని ప్రసాదించే గురుపీఠం.**

# జ్ఞానప్రదాత.. దత్తావధూత

మంగళ వారం
దత్తాత్రేయ జయంతి

**దత్తాత్రేయుడు** యోగి రాజు. ఏ స్థితి లౌకిక బంధనాలకు అతీతంగా విలక్షణంగా కనిపిస్తుందో, ఆ స్థితిని జ్ఞానులు యోగమార్గంలో అనుష్ఠించి గమ్యం చేరుతారు. అటువంటి సవ్యమార్గాన్ని చూపించే గురు సంప్రదాయానికి ఆద్యుడు దత్తాత్రేయుడు. దత్తస్వామి నెలకొల్పింది అవధూత సంప్రదాయం. అవధూత అంటే.. పూర్తిగా దేహధ్యాస లేనివారు. లౌకిక ప్రపంచం, బంధాలు, బంధుత్వాలు పట్టనివారు. వారు ఎక్కడా నిలవరు. ఆవు పాలు పితికినంత సేపే వారు ఒకచోట ఉంటారు.

**'అక్షరాత్, వరేణ్యాత్, ధూత సంసార బంధనాత్, తత్వ మస్యాది లక్ష్యత్వాత్, అవధూత ఇతీర్యతే'**

ఆశా పాశాల నుంచి విముక్తి పొందినవాడు, పూర్వకర్మల నుంచి విడివడినవాడు, ధూళితో కూడిన శరీరం వాడు (దేహం పట్ల అభిమానం లేనివాడు), తత్వ చింతన కలవాడు అవధూత అంటుంది దత్తావధూతగీత. దీన్నే అవధూత ఉపనిషత్తు ఇంకాస్త విశదంగా చెప్తూ అవధూత అంటే అక్షరుడు (నాశనం లేనివాడు), వరేణ్యుడు (ఉత్తముడు), ధూతబంధనుడు (సంసార బంధనాలేవీ లేనివాడు) వేదాంత గోచరమైన తత్వమస్యాది వాక్యాలకు లక్ష్యమైన వాడని చెబుతుంది. ఈ లక్షణాలన్నీ కలిగి బ్రహ్మ, విష్ణు,మహేశ్వరుల అంశతో త్రిమూర్తి స్వరూపంగా అవతరించిన పరబ్రహ్మ స్వరూపమే దత్తావతారం.

లోకంలో మహర్షులందరూ అవధూతలు కారు. వ్యాసుడు మహర్షి. ఆయన కొడుకు శుకమహర్షి అవధూత. శుకమహర్షి తండ్రిని విడిచి వెడుతూంటే పుత్రప్రేమతో వ్యాసుడు ఆయన్ను పిలుస్తూ వెనకాలే వెంబడిస్తున్నాడట. అక్కడ ఒక సరస్సులో స్నానం చేస్తున్న దేవతా స్త్రీలు శుక మహర్షిని పట్టించుకోలేదు. కానీ, వయోవృద్ధుడైన వ్యాసమహర్షి వస్తూంటే మాత్రం సిగ్గుతో వస్త్రాలు చుట్టుకున్నారట. అదీ అవధూత విశిష్టత.

మహా తపస్సంపన్నుడు అత్రి మహర్షికీ, పతివ్రతా శిరోమణి అనసూయాదేవికి కలిగిన పుణ్య సంతానమే దత్తాత్రేయ స్వామి. సత్వ, రజో, తమో గుణాలు లేనివాడు అ'త్రి' మహర్షి. న+ అసూయ అసూయా గుణం లేని, మరోవిధంగా చెబితే మాయను వదిలిన తత్వం గలది అనసూయా మాత. అందుకే త్రిగుణాతీతుడై మాయారహితుడైన అవధూత స్వరూపంగా దత్తాత్రేయుడు ఉద్భవించాడు. అత్రి తనయుడు కనుక ఆత్రేయుడు, తనకు తానుగా దత్తమయినాడు (తల్లిదండ్రులకు ఇవ్వబడినాడు) కాబట్టి దత్తుడు. వెరసి దత్తాత్రేయుడు అయ్యాడు. 'గురుదత్తా! జగత్తును అంధకారం నుంచి కాంతిమార్గంలోకి నడిపించడానికి అవతరించిన జగద్గురువు నువ్వు' అని తల్లిదండ్రుల నుంచి ఆశీఃపూర్వక అభినందనలు పొందిన దత్తుడు.. జగదోద్ధరణ కోసం సహ్యాద్రి పర్వతాలకు వెళ్లాడు.

దత్తాత్రేయుడు అవతరించిన మార్గశిర పౌర్ణమిని దత్త జయంతిగా చేసుకుంటాం. దత్తాత్రేయునిది జ్ఞానావతారం. విష్ణుమూర్తి ఏకవింశతి (21) అవతారాలలో ఆరోది దత్తరూపం. ఆయన కరుణా సముద్రుడు. ఒక్కోసారి భక్తులను కఠిన పరీక్షలకు గురిచేస్తాడు. ఆయన కనబరిచే ప్రతి లీలా ఓ సత్యాన్ని ఆవిష్కరిస్తుంది. ఓ తత్వాన్ని బోధిస్తుంది. అవతార లక్ష్యం పూర్తికాగానే విష్ణుమూర్తి ఆ అవతారం చాలించడం కనిపిస్తుంది. కానీ, దత్తావతారం పరిసమాప్తి లేనిది. గురు రూపంలో ఆయన చిరంజీవి.

దత్తుడు ఏ చీకూచింత లేకుండా నిరంతరం ఆనందమయ పరబ్రహ్మ స్థితిలో ఉండటానికి కారణమేమిటో తెలుసుకోవాలనుకున్నాడు యదువు (యాదవ వంశానికి మూల పురుషుడు). దానికి సమాధానం ఇస్తూ దత్తుడు లోకాన్ని అవలోకనం చేసుకోవడం వల్ల ఎంతో జ్ఞానాన్ని అందించే గురువులను పొందానని చెబుతాడు. 'ప్రకృతే నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. భూమి క్షమాగుణాన్ని, వాయువు నిస్సంగత్వాన్ని, ఆకాశం సర్వవ్యాపకత్వాన్ని, జలం నిర్మలత్వాన్ని, అగ్ని తేజస్సును నేర్పించాయి. సూర్యుడు, చంద్రుడు, పావురాల జంట, సర్పం, సముద్రం, మిడత, తేనెటీగ, ఏనుగు, తుమ్మెద, లేడి, చేప, వేశ్య, బాలుడు, బాలిక, కన్యక, సాలెపురుగు.. ప్రతిదీ తనకు గురువుగా నిలిచాయ'ని చెబుతూ 24 మంది గురువుల ద్వారా తను నేర్చుకున్న విషయాలను తెలియజేస్తాడు దత్తాత్రేయుడు. జీవన సాఫల్యానికి ప్రకృతి పరిశీలన అవసరమని, జీవితంలో తారసపడే ప్రతి సంఘటన నుంచి పాఠాలు నేర్చుకోవచ్చని దత్తుడి జీవితం మనకు ప్రబోధిస్తుంది.

... మరుమాముల దత్తాత్రేయ శర్మ

### దత్తస్తవం

**దత్తాత్రేయం మహాత్మానం వరదం భక్తవత్సలం**
**ప్రపన్నార్తి హరంవందే స్మర్తృగామీ సనోవతు॥**
**దిగంబరాయ విద్మహే అవధూతాయ ధీమహి**
**తన్నో దత్తః ప్రచోదయాత్॥**

తాత్వికంగా స్వామి దిగంబరుడు (దిక్కులే వస్త్రాలుగా కలవాడు). కేవల బ్రహ్మనిష్ఠతో దండకమండలాలను కూడా వదిలిన శుద్ధ సాత్విక చైతన్య మూర్తి అయిన అవధూత. భక్తితో స్మరిస్తే సంతృప్తిని పొంది తన దివ్యానుగ్రహాన్ని కురిపిస్తాడు. బ్రహ్మ విష్ణు మహేశ్వరుల రూపాలలో మూడు తలలతో, తెల్లని శరీరంతో, జటలతో, శంఖ, చక్ర, కమండల, జపమాల, త్రిశూల, డమరుకాలు ఆరుచేతులలో ధరించి, నాలుగు వేదాలకు ప్రతీకలైన నాలుగు శునకాలు వెంట ఉండగా.. ధర్మస్వరూపమైన గోవును తన వెనుక నిలుపుకొని ఔదుంబర (మేడి) వృక్షం నీడలో సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపంగా దత్తాత్రేయుడి రూపాన్ని భక్తులు దర్శించుకుంటారు.

# రమణీయం.. అనుసరణీయం

30న
రమణ మహర్షి
జయంతి

**అరుణగిరి అచంచలం. ఆ అచలంపై నడయాడిన రమణ మహర్షిదీ దాదాపూ అదే తత్వం. అందుకే, ఎక్కడ చోటు దొరక్క మౌనం ఆ మహనీయుడిని ఆశ్రయించింది. ఆ మౌనానికి ఊరడింపు కోసమో ఏమో ఆయన ఎప్పుడోగానీ మాట్లాడేవారు కాదు. ఆ మాటలు జ్ఞానగుళికలయ్యేవి. సత్యాన్ని బోధించేవి. తత్వాన్ని విశదపరిచేవి. బాధను ఉపశమింపజేసేవి. ఆనందాన్ని కలిగించేవి. మనసును తేటపరిచే ఆ మాటల్లోని కొన్ని అమృత బిందువులు..**

### సమదర్శి


తనపై ప్రత్యేకమైన శ్రద్ధను కనబరిస్తే రమణులు ఒప్పుకొనేవారు కాదు. ప్రత్యేకతంటే వారికి గిట్టనే గిట్టదు. దారిలో వెళ్తుంటే.. ఎదురుపడ్డ వాళ్లు తప్పుకోవటం కూడా సహించకపోయేవారు. ముందుగా ఆయనే తప్పుకొని వారిని పోనిచ్చిన తరువాత వారు నడిచేవారు. ఆ సమత్వంలో, ఎదుటి వారిని అర్థం చేసుకునే ఆ విశాల హృదయంలో మనం వెయ్యో వంతు అలవరచుకున్నా ధన్యులమే! చాలామందికి మహర్షి సాన్నిధ్యమే ఆధ్యాత్మిక భద్రతనీ, మానసిక సరళతనీ విశ్వాసాన్ని కలిగిస్తుంది.

### అమృతవాక్కులు...

రమణుల అమృత సమానమైన వాక్కులు ఆత్మాన్వేషణకే కాదు మనలో ఆత్మవిశ్వాసాన్ని కూడా నింపుతాయి. ఎవరైనా ఆత్మన్యూనతతో బాధపడితే భరించలేకపోయేవారు మహర్షి. మానసికంగా కుంగిపోతున్న ఓ భక్తునితో 'తాను దుర్బలుడననీ, దుష్టుడననీ అనుకోవటమే ప్రతి మానవుడూ చేసే పెద్ద తప్పిదం. వాస్తవానికి ప్రతి మనిషీ దైవిక సంపన్నుడే, బలాఢ్యుడే! అతని ఆలోచనలు, అలవాట్లు, వాంఛలు, భావాలు' ఇవే దుర్బలమైనవి. ఇవి మనిషి సహజ లక్షణాలు కానేకావు' అని ఊరడించేవారు.

### ఉపవాసాలపై ఉపదేశం..

ఉపవాసాల ప్రాముఖ్యం గురించి ఓ భక్తుడు రమణుల వద్ద ప్రస్తావించాడు. అప్పుడు మహర్షి స్పందిస్తూ 'ఇంద్రియ సంబంధమైన వ్యాపకాలన్నిటినీ ఆపేస్తే మనస్సు ఏకాగ్రమవుతుంది. అటువంటి మనసు భగవంతుని మీద లగ్నమైతే అదే అసలైన ఉపవాసం. వాంఛలే మనసుకు ఆహారం. వాటిని విడనాడటమే ఉపవాసం! మనసుకు ఆహారం లేకుండా చేయగలిగినవాడు, దేహానికి ఆహారాన్ని నిరాకరించనక్కర లేదు. మనసుకు ఉపవాసం కలిగించలేని వారి కోసమే శారీరకమైన ఉపవాసాన్ని నిర్దేశించారు' అని వివరించారు.



### దేహం బరువు

శరీరాన్ని ఎంత తక్కువ ప్రేమిస్తే ఆత్మకు అంత చేరువ అవుతామనే వారు రమణులు. దేహభ్రాంతి మనిషి ఆధ్యాత్మిక ఉన్నతికి అడ్డంకి కలిగిస్తుందని ప్రబోధించేవారు. పారమార్థిక జ్ఞాని మానసికస్థితి ఎలా ఉంటుందో స్పష్టం చేస్తూ 'జ్ఞాని అయినవాడు కూలికి బరువు మోసినట్లే ఈ దేహాన్ని మోస్తాడు. గమ్యస్థానం వచ్చేది ఎప్పుడా? ఎప్పుడా? అని ఎదురుచూస్తాడే కానీ! ఏవో ప్రయత్నాలు చేసి ఈ బరువును ఇంకా మోయాలనుకోడు! సరైన జ్ఞానం కలిగితే, ఈ శరీరం ఎవరికి కావాలి? సదా నిర్మలంగా ఉండే తనకు ఈ మోత బరువెందుకు?' అంటారు రమణ మహర్షి. వారు కూడా స్వయంగా తమ దేహాన్ని చిరునవ్వుతో త్యజించారు.

### చెప్పటమే మన వంతు...

ఒకసారి ఆశ్రమ వంటశాలలో అరటిపూలతో కూర వండుతున్నారు. అందులో భాగంగా పూలను తరుగుతూ, వాటి మీద ఉన్న దొప్పలను తీసి గంపలో నింపేస్తున్నారు. ఆ తరువాత వాటిని బయట పడవేస్తారు. ఇది ఎప్పటినుంచో జరుగుతున్నది. రోజువారీ వాహ్యాళిలో భాగంగా రమణులు గోశాల వైపు వెళ్తుండగా అరటిపూల దొప్పలు పడవేయటం గమనించారు. పక్కనే ఉన్న ఓ ఆశ్రమవాసితో 'అయ్యో! అరటి దొప్పలను ఎందుకు అలా వృథా చేస్తున్నారు. వాటిలో కూడా చాలా పోషకాలు ఉంటాయి' అన్నారు. అప్పుడు ఆ ఆశ్రమవాసితో పాటు భక్తులు కూడా ఆశ్చర్యపోయారు. ఆ దొప్పలను ఎలా వండాలో అర్థం కాక, అక్కడి వారు ప్రశ్నార్థకంగా ముఖాలు పెట్టారు. అప్పుడు రమణులే స్వయంగా ఆ అరటిపూల దొప్పలను తరిగారు. ఇంగువ, ఎండు మిరపకాయలు తదితర పదార్థాలన్నింటినీ కలిపి చక్కని వంటకాన్ని తయారు చేశారు. ఇంకెప్పుడూ ఈ అరటిదొప్పలను వృథా చేయకూడదని వంటశాల సిబ్బందికి సూచించారు. కొంచెం కష్టమైనా మహర్షి మాట కాదనలేక వంటవాళ్లు కూర వండారు. అయితే కొన్నాళ్లకు మహర్షి గిరి ప్రదక్షిణ చేసి వస్తూండగా, దూరంగా ఓ చోట గుంతతీసి ఏవో పూడ్చినట్లు నేల కొంచెం ఎత్తుగా కనిపించింది. వెంటనే రమణులు చేతికర్రతో దాన్ని అలా తవ్వినట్లు చేశారు. ఆ గుంతలోంచి అరటిపూల దొప్పలు బయటపడ్డాయి. వాటిని వండే ఓపిక లేక, తనకు కనిపించకుండా ఇలా కప్పిపెట్టారని వారు అర్థం చేసుకున్నారు. 'అయ్యో! వండకపోయినా కనీసం పశువులకు వేసినా తినేవి కదా!' అనుకుంటూ ముందుకు వెళ్లిపోయారు. అంతే! ఇక ఆ తరువాత ఆ మహానుభావుడు వంటశాలలో అరటిపూల ప్రస్తావనే తేలేదు. రమణులు ఏదైనా ఒక్కసారే చెప్పిచూసేవారు. వినిపించుకోలేదంటే తిరిగి బలవంతపెట్టి చేయించే అలవాటు వారికి లేదు. 'చెప్పటమే మన వంతు, వినటం, విని ఆచరణలో పెట్టటం ఎదుటివారి వంత'ని మహర్షి ఆంతర్యం!

... మనోజ్ఞ

## అందరికీ అందేవరకూ..!




**అరబ్** సామ్రాజ్యంలో ఖలీఫా ఉమర్ (రజి) పరిపాలనా కాలమది. రాజ్యంలో ఒకసారి తీవ్రమైన కరువు వచ్చింది. క్షామంతో ఎవరూ సరైన తిండికి నోచుకోలేకపోయారు. ఖలీఫా ఉమర్ (రజి) తన ఖర్చులన్నిటినీ తగ్గించుకున్నారు. కరువు దూరమయ్యేంత వరకూ పాలు, నెయ్యి, మాంసం ముట్టనని ప్రతిజ్ఞ చేశారు. కొన్ని రోజులు గడిచాయి. అంగట్లోకి పాలు, నెయ్యి అమ్మకానికి వచ్చాయి. సేవకుడు వాటిని కొనుగోలు చేసి ఖలీఫా ముందుంచాడు. 'ఇవన్నీ ఎక్కడివి?' అని అడిగారు ఖలీఫా. బజారులో ఇవన్నీ అమ్మకానికి వచ్చాయంటే ప్రజల స్థితిగతులు మెరుగుపడ్డాయని అర్థం' అని చెప్పాడు సేవకుడు. దానికి ఖలీఫా 'ఖరీదైన వస్తువులు, పదార్థాలన్నీ ప్రజలకు అందుబాటులోకి రానంత కాలం నేను వీటిని ముట్టేది లేదు. అందుకోసం ఎన్నాళ్లయినా వేచి చూస్తాను' అన్నారు. ఈ పాలు, నెయ్యి ఎవరికైనా పంచమని చెప్పారు. ప్రవక్త కాలంలో పాలకులను చక్రవర్తి, రాజు అని సంబోధించేవారు కాదు. ఖలీఫా అని పిలిచేవారు. ఖలీఫా అంటే అల్లాహ్ ప్రతినిధి అని అర్థం. పాలనా వ్యవహారాల్లో అల్లాహ్ చూస్తున్నాడు అనే స్పృహతో పరిపాలన చేయాలని ముహమ్మద్ ప్రవక్త ప్రబోధించారు.

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076